ఎమ్మెల్సీ కవితపై బండి వ్యాఖ్యలు దారుణం

- తక్షణమే క్షమాపణ చెప్పాలి
- ఉపసంహరించుకోవాలి
- లేకుంటే సంజయ్‌ను తిరగనివ్వం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఎల్‌బీనగర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం


బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

లింగోజిగూడ: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు దారుణమని... ఆయన వెంటనే క్షమాపణలు చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కవితపై బండి దారుణ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం ఎల్‌బీనగర్ చౌరస్తాలో సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ కుటుంబంపై బీజేపీ అధినాయకత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అందులో భాగంగానే కవితను ఏకధాటిగా ఎనిమిది గంటల పాటు ప్రశ్నించిందన్నారు. అయినా ఢిల్లీ మద్యం కుంభకోణంతో సంబంధం లేకపోయినా కేంద్ర దర్యాప్తు సంస్థలపై ఉన్న నమ్మకంతో కవిత ఎంతో ఓపికతో వారడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పిందని గుర్తుచేశారు. రోజు ఉదయం లేస్తేనే దేవుళ్ల పేరు చెప్పుకునే బీజేపీ నాయకులు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వారి సంస్కారహీనానికి నిదర్శనమని దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇకనైనా బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని... లేకపోతే మహిళలే తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కార్పొరేటర్ సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస్, కొప్పుల విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జి.వి.సాగర్‌రెడ్డి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్, అంజలి, శ్వేతారెడ్డి, సువర్ణ, ఆదిలఓ లత, ప్రమీల, ప్రసన్న, మల్లిక, నాగలక్ష్మి, అనసూయ, ఉష, రజిని, సరోజ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 28, బెండ 60, పచ్చి మిర్చి 50, కాకర 45, బీర 45, క్యాబేజి 11, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 15, దొండ 35–45, చిక్కుడు 45, గోకర 45, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలు 17, దోస 40, సొర 15, పొట్ల 15, ఉల్లి 16 చామగడ్డ 65 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఐవీఎఫ్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా శైలజ



నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ స్టేట్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా ఎం.శైలజ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఐవీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆదివారం నాగోలులో ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, ఐవీఎఫ్ స్టేట్ మహిళా విభాగం ట్రెజరర్ భువన తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలని వినతి

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం కార్యవర్గానికి కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో వెంటనే కాలనీ సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహించాలని కాలనీకి చెందిన పలువురు ఆదివారం ప్రస్తుత అధ్యక్షుడు ఆర్.జగదీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సంజయ్‌కుమార్, సలహాదారు నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్‌లకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్యగౌడ్, క్రాంతికుమార్‌గౌడ్, సత్యనారాయణ, అనిల్, వెంకటేశ్వర్లు, రాజు, సంతోష్, చారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శివాలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు హోమంలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో శ్రీరామభక్త సమాజం సభ్యులు నిరంజన్ యాదవ్, ప్రమోద్, ప్రవీణ్, రాహుల్‌కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

అబిడ్స్: తమ బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సెక్రటరీ బీఎస్ మదుసూధన్ అన్నారు. బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఆదివారం తెలంగాణ కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ 2వ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులంతా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ బ్యాంక్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తా

అబిడ్స్: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గోడేకబర్‌లో డబుల్ బెడ్‌రూంల వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ఆశీష్‌కుమార్ ఆయూష్ కేంద్రం పేరిట ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మహిళల స్వీయరక్షణకు మార్షల్‌ఆర్ట్స్ దోహదం


ప్రతిభ చూపిన చిన్నారికి బహుమతి ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: బాలికలు, మహిళలు స్వీయరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రిటైర్డ్ న్యాయమూర్తి నాడిపల్లి ఆనంద్‌రావు సూచించారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వ ఖేలో భారత్ కార్యక్రమంలో భాగంగా సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంపాపేటలోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఓపెన్ స్టేట్ లెవెల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ న్యాయమూర్తి నాడిపల్లి ఆనంద్‌రావు మాట్లాడుతూ... మార్షల్ ఆర్ట్స్‌ను ఒక కళగా గుర్తించి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు తప్పనిసరిగా నేర్పించాలన్నారు. కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... కరాటే సాధనతో చిన్నారుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆసక్తి ఉన్న కళల్లో ప్రోత్సాహంతో కూడిన శిక్షణ ఇప్పించాలన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన వారికి కేటగిరీల వారీగా కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల సందర్భంగా పలువురు చిన్నారుల విన్యాసాలు అందరినీ అలరించాయి. ఐదేళ్ల రిత్విక నాన్‌చాక్‌తో చేసిన విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. బీజేపీ మలక్‌పేట నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి అధికారుల స్పందన భేష్

లక్డీకాపూల్: శ్రీరాంనగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి కష్టాలపై స్పందించిన జలమండలి అధికారులు సెలవు అయినా ఆదివారం కమ్యూనిటీ బోర్‌వెల్‌కి మరమ్మతులు చేయించడం అభినందనీయమని ఆ కాలనీ అధ్యక్షుడు వి.రాముగౌడ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ నాయక్ అన్నారు. వనస్థలిపురం వాటర్ బోర్డు జనరల్ మేనేజర్ వినోద్, మేనేజర్ రాజులు తమ విజ్ఞప్తి మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాలనీవాసులు దాహార్తిని తీర్చారన్నారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందుల పట్ల తీవ్రంగా స్పందించిన అధికారులు వెనువెంటనే సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడమే కాకుండా సకాలంలో పని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. తమ సమస్యలపై త్వరితగతిన స్పందించిన జీఎం వినోద్, మేనేజర్, సిబ్బందికి కాలనీవాసుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం: డీసీ జయంత్


పోలీస్ బందోబస్తుతో ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా.. ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో సర్వం సిద్ధం చేశామని జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఆదివారం మలక్‌పేటలో ఆయన మాట్లాడుతూ... మూసారంబాగ్‌లోని బ్రిలియంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఆదివారం పోలీస్ బందోబస్తుతో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి మలక్‌పేటలోని బూత్‌లకు ఎన్నికల సామగ్రిని సిబ్బందితో తరలించామని ఆయన వివరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు బూత్‌ల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ


విద్యార్థులతో డీసీపీ సాయిశ్రీ

లింగోజిగూడ: విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎల్‌బీనగర్ డీసీపీ సాయి శ్రీ అన్నారు. ఎల్‌బీనగర్ కాకతీయనగర్ కాలనీలోని కాకతీయ పాఠశాలలో శనివారం రాత్రి 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీపీ సాయిశ్రీ మాట్లాడుతూ... 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలతోపాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఉమారెడ్డి, ప్రిన్సిపాల్ సుచరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: ఉరుకుల పరుగుల జీవన విధానంలో ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనాని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి సూచించారు. ఆదివారం సరస్వతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... తరుచూ వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా ఏదైనా అనారోగ్య లక్షణాలు ఉంటే గుర్తించి ముందస్తుగా తగిన వైద్యం తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గున్న మహేందర్‌రెడ్డి, నేతలు భాస్కర్, ప్రభాకర్, మధు, శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం



లింగోజిగూడ: కాలనీలు, బస్తీల్లో పేదలకు మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని.. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రాంమోహన్‌గౌడ్ అన్నారు. మన్సూరాబాద్ ఏవైసీ ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని లక్ష్మీప్రసన్నగౌడ్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పావని, గౌతమ్‌రావు, కొప్పుల వెంకట్‌రెడ్డి, హరిప్రసాద్, అరుణ్‌బాబు, ప్రశాంత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు



కాచిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులలో బీసీలకు ఒక్కరికి కూడా ఇవ్వకుండా బీసీలను పూర్తిగా విస్మరించారని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ బీసీలను విస్మరించిన పార్టీలకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య సంరక్షణలో జాగ్రత్తగా ఉండాలి

నాగోలు: ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు అన్నారు. ఆదివారం నాగోలు బండ్లగూడలోని మధురానగర్ కాలనీలో సుప్రజ హాస్పిటల్, మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలనీవాసులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. గైనకాలజిస్టు, జర్నల్ ఫిజీషియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడుతున్న వారు తరుచు వివిధ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మోహనాచారి, కార్యదర్శి కె.వి.నర్సింహారెడ్డి, అసోసియేషన్ సభ్యులు సత్యప్రకాష్, పి.ప్రశాంత్‌రెడ్డి, సూర్యప్రకాష్, ఆర్.రమేష్, జానకి, భాస్కర్‌రావు, చిన్న కృష్ణారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం



అబిడ్స్: బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కరిష్మారాణి షిండేను ఆదివారం ధూల్‌పేటలో గోషామహల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పప్పుమాత్రే ఆధ్వర్యంలో సత్కరించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో కరిష్మారాణి గోల్డ్ మెడల్ సాధించింది.

ఇంద్రప్రస్థ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

నాగోలు: నాగోలు డివిజన్ బండ్లగూడ శ్రీ ఇంద్రప్రస్థ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం కాలనీలో నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గాయత్రీ వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.వరకుమార్, భాస్కర్‌రావు, కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.హరిబాబు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎస్.సి.గోపాల్, కోశాధికారిగా వి.సంతోష్‌రెడ్డి, సహాయ కోశాధికారిగా రంగనాథ్, సాంస్కృతిక విభాగం కార్యదర్శిలుగా రాధికాదామరాజు, ప్రేమ్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణరెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలిగా తేజస్విని విక్రమ్‌రెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... కాలనీని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి


ఆర్టీఐ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నాగోలు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పప్పుల సుధాకర్ తెలిపారు. ఆదివారం ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలోని లైఫ్ ఫౌండేషన్ కార్యాలయంలో సమాచార హక్కు సలహా, సహాయ–రక్షణ సమితి, లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు–ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పప్పుల సుధాకర్, సమాచార హక్కు సలహా, సహాయ రక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్‌టీఐ ట్రైనర్ సరికొండ రుషికేశ్వర్ రాజు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టంలోని 31 సెక్షన్లపై పూర్తిస్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. సెక్షన్ 7 (5) ప్రకారం దారిద్ర్య రేఖకు దిగున ఉన్నవారు సమాచారం కోసం దరఖాస్తుకు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. సమాచారం పొందడానికి కూడా ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. సెక్షన్ 7(6) ప్రకారం నిర్ణీత సమయంలోపు పౌర సమాచార అధికారి సమాచారం ఇవ్వకుంటే ఆ తర్వాత పూర్తి సమాచారాన్ని ఉచితంగా ఇవ్వవలసి ఉంటుందన్నారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 17 సంవత్సరాలు పూర్తికావచ్చినా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు ఆ కార్యాలయంలో సెక్షన్ 4(1)(బి) అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారం అందించేందుకు నియమితులైన పీఐఓలకు ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించకుండా ఆ స్థానాల్లో కూర్చోబెట్టడం మంచి పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక ఇబ్బందులు దరఖాస్తుదారులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆర్‌టీఐ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స.హ కార్యకర్తలు రమాకాంత్, భానుశ్రీ, న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి, అనురాధ, శంకర్, నరసింహ, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

చైతన్యపురి: అమ్మనాన్న ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పాల్తీ శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ముద్రించిన పంచాంగాన్ని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... తెలుగు వారికి పంచాంగం చక్కటి మార్గదర్శి వంటిదని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ ద్వివేది రవీందర్‌శర్మ, దరూరి మురళీధరాచార్యులు, వూర నర్సింహగుప్తా, మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా, వక్కలంక శ్రీనివాస్, బాల రాజ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తదితరులు

సందడిగా టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు


చైర్మన్, డైరెక్టర్‌లను సత్కరిస్తున్న విద్యార్థులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ లోటస్ ల్యాప్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో సందడిగా జరిగింది. ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుటుంబానికి, దేశానికి మంచి నడవడిక, విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఆధ్యాపక బృందాన్ని ఘనంగా సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరం లాంటిందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని తన కార్యాలయంలో అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, ఆజంపురా, చావుని, ఓల్డ్‌మలక్‌పేట డివిజన్లకు చెందిన 30 మంది లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రూ.16,88,500ల విలువైన చెక్కులు అందజేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో మహిళలకు గౌరవం ఏదీ: బీజేపీ


విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి


లింగోజిగూడ: బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు ఎలాంటి గౌరవం ఉందో అందరికీ తెలుసని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సామ మాట్లాడుతూ... మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఢిల్లీలో ధర్నా చేసిన ఎమ్మెల్సీ కవిత రాష్ట్రంలో మహిళలకు ఎప్పుడు.. ఎన్ని మంత్రి పదవులు ఇచ్చారో చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు జరిగిన అన్యాయానికి ముందు న్యాయం చేయాలని సూచించారు. అన్యాయం జరిగిందని మీడియా ముందుకు వచ్చిన మహిళలకు ప్రప్రథమంగా న్యాయం చేయాలని కోరారు. ర్యాగింగ్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వైద్య విద్యార్థిని ప్రీతి విషయంలో మహిళా కమిషన్ స్పందించక పోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెక్క అశోక్‌కుమార్, నూతి శ్రీనివాస్, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

శివారు కాలనీలకు ఆర్టీసీ సర్వీసులను విస్తరించాలి


రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: నగర శివారు ప్రాంతంలో కాలనీలు పెరుగుతున్నందున ప్రజల అవసరాల మేరకు ఆర్టీసీ తమ సర్వీసులను శివారు కాలనీలకు విస్తరించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్లాం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కట్టమైసమ్మ కాలనీ వద్ద డీఎం రఘుతో కలిసి ఆయన రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అడగగానే డిపో మేనేజర్ రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్ స్టాప్ వల్ల సుమారు 15 కాలనీలకు బస్సు సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. ఇక్కడి నుంచి సచివాలయంతో పాటు నగరంలోని ఇతర ముఖ్య ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, సిబ్బంది వెంకట్‌నాయక్, కాలనీ నేతలు వీరస్వామి, దేవోజీనాయక్, రాములు, భద్రారెడ్డి పుల్లారావు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి శ్మశానవాటికలు


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

లింగోజిగూడ: సకల వసతులతో ఆటోనగర్ హిందూ, ముస్లింల శ్మశాన వాటికలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. ఆటోనగర్‌లోని హిందూ, ముస్లింల శ్మశాన వాటికను, డంపింగ్ యార్డును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ముస్లింలు తమ బంధువులు, మిత్రులకు అంతిమ సంస్కారాలను బయట చేయకుండా శ్మశాన వాటికలోనే చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా శ్మశానవాటిక నిర్మాణంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. త్వరలో పనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9505507616
9912220363
9912220365